క్లుప్తంగా

యూరియా నిల్వల తనిఖీ



యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసరాజు

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో యూరియా నిల్వలను తనిఖీలు నిర్వహించాలని దెందులూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్ శ్రీనివాసరాజు అన్నారు. ఆదివారం దెందులూరు ఇతర గ్రామాల్లో తనిఖీలు చేసి నివేదికలు పంపామని వ్యవసాయాధికారి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహాల ఏర్పాటు

దెందులూరు: పోతునూరు పంచాయతీ కొత్తూరు లో నూతనంగా నిర్మించిన శ్రీ గౌరీ శంకరుల ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహాల వాయు ప్రతిష్ఠ నిర్వహించారు. తొలుత విగ్రహాలకు అభిషేకం హోమాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ గౌరీ శంకరులు, విఘ్నేశ్వర కుమార, ఆంజనేయ స్వాముల విగ్రహాలు, వాయు ప్రతిష్ఠ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొత్తూరు పోతునూరుతో పాటు సమీప గ్రామాల్లో అధిక సంఖ్యలో భక్తులు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహాల శిల్పి మేస్త్రి పండితులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

దెందులూరు: కొవ్వలిలోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారికి పలు రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి ఆలయ వార్షికోత్సవాలకు తరలి వచ్చిన సుమారు 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు



ఉత్సవానికి సిద్ధమవుతున్న కమిటీ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెంలోని ప్రముఖ దేవాలయమైన శ్రీగణపతి నవరాత్రుల ఎనిమిదో వార్షిక ఉత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభించారు. ఆదివారం బాల గణేష్ యూత్ సభ్యులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నెల 27 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు నవరాత్రుల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని బాల గణేష్ యూత్ కమిటీ సభ్యులు అన్నారు.

వైభవంగా కృష్ణుని విగ్రహ నిమజ్జనోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న రాజస్థానీ మహిళలు

భీమడోలు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం రాధాకృష్ణుని విగ్రహ నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. భీమడోలు జంక్షన్ ప్రాంతానికి చెందిన రాజస్థానీ కుటుంబాల వారు కొన్నేళ్లుగా ఇక్కడ కృష్ణాష్టమిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారు రాధాకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు, భజన సంకీర్తనలు నిర్వహించారు. మహిళలు, యువతులు విగ్రహానికి భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం చేశారు. పవిత్ర గోదావరి కాలువలో నిమజ్జనం చేశారు.

టెన్త్ టాపర్లకు మెరిట్ స్కాలర్‌షిప్



విజేతలకు చెక్కును అందజేస్తున్న దాతలు

దెందులూరు: గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన చైతన్యశ్రీకి రూ.2 వేలు, రెండో ర్యాంక్ సాధించిన దిలీప్‌కు రూ.1500 ఇంగ్లిష్‌లో టాపర్ చైతన్యశ్రీకి రూ.1500 మెరిట్ స్కాలర్‌షిప్‌ను ఆదివారం ఆకుల ఉమాలక్ష్మి నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ తరపున వారి కుమారులు ఆకుల శ్రీధర్, ఆకుల ప్రసాద్ చెక్కులను అందజేశారు.

భారీ వర్షాలతో చెరువులకు జలకళ

- నిండుకుండల్లా మైనర్ ఇరిగేషన్ చెరువులు
- జోరు వానతో ప్రజలకు తప్పని అవస్థలు



పూర్తిగా నిండిన చిన్న వెల్లమిల్లి వీరభద్రుని చెరువు



జలకళ సంతరించుకున్న నాచుగుంట కోటాడ చెరువు



దొంతవరం, రావులపర్రు ఆయకట్టులో నీటమునిగిన పంట చేలు

ఉంగుటూరు: విస్తారంగా కురిసిన వర్షాలకు మైనర్ ఇరిగేషన్ చెరవులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. నిన్నమొన్నటి వరకు చెరువులో నీరు లేక వెలవెలబోయాయి. చిన్న, సన్న కారు రైతులు సాగునీటి కోసం దుక్కి చేసుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి నుంచి ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండిపోయాయి. ఒక దశలో చెప్పాలంటే అంచులపై వరకు వచ్చి నీరు చేరింది. అయితే అప్పటికే నాట్ల పనులు పూర్తి చేసేశారు. ఉంగుటూరు మండలం మెట్ట ప్రాంతంలో విస్తరించిన మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. అటవీ ప్రాంతం, మెట్ట ప్రాంతం నుంచి 23 కిలోమీటర్ల మేర నల్లజర్ల మండలం నుంచి వాగులు వంకల ద్వారా నీరు చేరింది. చెరువులు నిండిపోయాయి. ఈ వర్షం నీటితో చెరువులు నీరు తొణికిసలాడుతున్నాయి. వెల్లమిల్లి పంచాయతీలో వీరభద్రుని చెరువు, కొత్త చెరువు, బొడ్డువానిక్రర, భీముడు చెరువు, నక్కల చెరవు, కుమ్మరికుంట, ఉంగుటూరులో యర్రచెరువు, నల్లచెరువు, అబ్బినీడి చెరువు, నాచుగుంటలోని కోటోడు చెరువు, పట్టెమ్మ చెరువు, అంతేడి చెరువు, తోటవాని చెరువులు నీటితో నిండిపోయాయి. గోపీనాథపట్నం పెద్ద చెరువు, నల్లమాడులో నల్లమాడు చెరువు, మొగలి చెరువు, చిట్టెమ్మచెరవు, గోపాలపురం జలాది చెరవు, పందిరెడ్డిగూడెం కేశాని చెరవు, చందమామ చెరవు, రామచంద్రపురం చెరవు, గొల్లగూడెం ధర్మ చెరవు, భీముడు చెరవు, కైకరంలో చెరవులు, ఎ.గోకవరం పెద్ద ట్యాంకు, గోకవరం ఆయకట్టులో నీలవాని పానిచెరవు, కొత్త చెరువు, మంగలిక్రర, తెల్లివాని క్రర, నంబూని వారి చెరువు, పెద్దచెరవు, కొత్త క్రర చెరువు, తిమ్మయ్యపాలెం రామన్న క్రర, తల్లివాని కుంట చెరవులు ఇటీవల కురిసిన వర్షాలకు నిండిపోయాయి. ఇంకా వర్షాలు కురిస్తే ప్రమాద స్థాయిని దాటి చెరువులకు గండి పడే ప్రమాదాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రస్తుతం పెరిగిన చెరువుల నీటిమట్టం వలన మెట్ట ప్రాంతంలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న బోర్లు లేని చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగంగా మారాయి. అడుగంటిన బోర్లకు నీటి లభ్యత పెరుగుతుంది. దీని వలన భూగర్భ జలాల నీరు పెరగనుంది. దీంతో సాగు నీటికి ఈ ఏడాది ఇబ్బంది ఉండకపోవచ్చు. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో చెరువులకు జలకళ సంతరించుకుంది.

పంటచేలు నీటమునక

మండలంలోని డెల్టా గ్రామాల్లో మూడు వేల ఎకరాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇటీవల వేసిన నాట్లు ఇన్ని రోజులు మునిగి ఉంటే కుళ్లపోతాయని తిరిగి భతకవని, తేరుకోవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెల్టాలోని రావులపర్రు, దొంతవరం, కాకర్లమూడి, వీఏపురం, కైకరం శివారు ప్రాంతమైన వీకే పురం, రామన్నగూడెం ప్రాంతాల్లో నీటితో నిండిపోయి మూనలు మునిగే ఉన్నాయి. నాలుగు రోజులు పూర్తి అయిపోవడంతో ఇంకా బతకవని అంటున్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ఉట్టి కొడుతున్న చిన్నారులు

భీమడోలు: మండల వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి హిందూ సంప్రదాయంలో పవిత్రమైన పండుగ కావడంతో గ్రామ గ్రామాన ఉట్టి కొట్టే వేడుకలు ఘనంగా నిర్వహించారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల, పోలసానిపల్లి, కోడూరుపాడు, అంబర్‌పేట, కొల్లేరు గ్రామాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలకు పూజలు చేశారు. శ్రీకృష్ణుడిని గోపాలకృష్ణుని విగ్రహాలను పూలతో విశేషంగా అలంకరించారు. భక్తులు ఉపవాసం ఉండి పాలు, వెన్న, నెయ్యి, పెరుగు నైవేద్యంగా సమర్పించారు. గుండుగొలనులోని శ్రీసీతారామ స్వామి వారి ఆలయంలోని శ్రీకృష్ణుడిని విశేషంగా అలంకరించారు. ఆలయ ఫౌండర్ ఆలయం వద్ద ఉట్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో శ్రీకృష్ణుడిని ఊరేగించారు. భీమడోలులోని గణపతి సెంటర్, పెరుమాళ్ల స్తంభం, శివాలయం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

చినుకు పడితే రోడ్డు చిత్తడి



భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు అధ్వానంగా ఉన్న రోడ్డు



అడుగు అడుగునా గోతులతో నిండిన రహదారి

భీమడోలు: జాతీయ రహదారులకు అనుసంధానంగా వెళ్లే రాష్ట్రీయ రహదారి భీమడోలు సంత మార్కెట్ నుంచి భీమడోలు జంక్షన్ రోడ్డు అధ్వానంగా మారింది. గోతులతో నిండిన ఈ రహదారి వర్షాలతో మరింత ఛిద్రంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రద్దీగా ఉండే ఈ రహదారిపై ఇరువైపులా గోతులను రూ.20 లక్షలతో పూడ్చారు. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలివ్వడంతో వేసిన నాలుగు నెలలకే రోడ్డు పాడైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు, భక్తులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ గోతుల్లో నీరు నిండడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శని, ఆది వారాల్లో ఈ రోడ్డు ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు వర్షాలు పడడంతో గోతుల వలన వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు కిలో మీటర్ల మేర ఈ రోడ్డుపై ప్రయాణం నరక యాతనగా మారింది. భీమడోలు ఆసుపత్రి వద్ద డ్రెయిన్ తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పొంగి ప్రవహిస్తుంది. దీంతో భారీ గోతులతో నిండిపోయింది. ఏది ఏమైనా ఈ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. అయితే ఈ రోడ్డుకు నిర్మాణానికి ఆర్అండ్‌బీ శాఖ రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచినట్లు తెలిసింది. అన్నీ సజావుగా సాగితే వర్షా కాలం పూర్తయిన తరువాత ఈ రోడ్డు నిర్మాణం చేపడతామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఉత్సాహంగా వ్యవసాయ పనులు



వర్షాలు పడడంతో పొలంలో ఉత్సాహంగా మందులు జల్లుతున్న రైతు

పెదవేగి: గత కొద్ది రోజులుగా కురిసిన వర్షానికి అన్నదాతల మోములో చిరునవ్వు వెల్లు విరిసింది. ఈ సంవత్సరం సరైన వర్షాలు లేవనుకున్న సమయంలో ఊహించని రీతిలో మంచి వర్షాలు పడడంతో వేసిన పంటలపై ఆశలు వదులుకున్న రైతులకు ఈ మధ్య కాలం కురిసిన భారీ వర్షంతో జీవం వచ్చింది. పెదవేగి మండలంలో వర్షాలు మరిన్ని రోజులు కొనసాగితే చెరువులు నిండి కనీసం రెండో పంటకైనా సాగునీరు గ్యారెంటీ ఉంటుందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం ఆగస్టు నెలాఖరు నాటికి ఖరీఫ్ కాలం ముగుస్తుంది. అయితే ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొనకపోవడంతో రైతులు కొంతమేర నిరాశ చెందగా, ఇలా కురిసిన వర్షానికి వ్యవసాయ పనులు మరింత ఊపందుకోవడానికి అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు.

మరికొన్ని రోజులు కురవాలి

పెదవేగి మండలంలోని 2 వేల 475 హెక్టార్ల ఖరీఫ్ విస్తీర్ణం కాగా, దాదాపు పంట మొత్తం పిలకల దశలో ఉందని పొలాలకు నత్రజనితో కూడిన ఈ వర్షం నూతన నిగారింపును తెచ్చిపెడుతుందని వ్యవసాయధికారి ఎల్.శ్రీనివాసరావు తెలిపారు. మరికొన్ని రోజులు వర్షాలు పడితే తప్ప ప్రస్తుతం ఉన్న నీటితో ఖరీఫ్ గట్టెక్కడం కష్టమని రైతులు చెబుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు

పోలవరం రూరల్: అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు రైతాంగం ముమ్మరంగా వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గత రెండు నెలలుగా వర్షాలు లేక, నాట్లు పడక, చెరువులు నిండకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాలతో కొండవాగులు ఇప్పుడిప్పుడే పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండుకుండలా మారుతున్నాయి. కొవ్వాడ కాలువ, పేడ్రాల, నక్కల గొయ్యి, ఇసుక కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ముక్కు మూసుకోవాల్సిందే!

- డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్త
- వెదజల్లుతోన్న దుర్గంధం
- ప్రజలకు వ్యాధుల భయం



చింతలపూడి నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డులో తగలబడుతున్న చెత్త



కొప్పుల వారివీధిలో డ్రెయిన్‌లో నిలిచిన మురుగు నీరు, చెత్త

చింతలపూడి : ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు పెరిగిపోయి ప్రజలను జ్వరాల భయం వెంటాడుతోంది. ప్రధానంగా చింతలపూడి నగర పంచాయతీ నుంచి కొన్ని ప్రధాన రహదారులపై ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. ఇందుకు పట్టణంలోని చెత్తా చెదారం ఈ రోడ్లపై పోస్తుండటం, వాటి నుంచి దుర్గంధం వెదజల్లుతుండడమే కారణం. ముఖ్యంగా టి.నరసాపురం వెళ్లే రహదారిపై టన్నుల కొద్దీ చెత్త పోస్తున్నారు. దీనిని వారానికి ఒకసారి తగలబెడుతున్నారు. తద్వారా వచ్చే పొగ, వేడి గాలులకు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

డంపింగ్ యార్డు లేక..

నగర పంచాయతీకి సరైన డంపింగ్ యార్డు లేదు. దీంతో ప్రతి రోజూ వచ్చే టన్నుల కొద్దీ చెత్తను రోడ్లపై పోస్తున్నారు. వీటిల్లో పందులు చేరి అంటు వ్యాధులకు కారణమవుతున్నాయి. కనీసం బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయడంపైనా అధికారులు శ్రద్ధ చూపడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు బయటికి పోయే దారిలేక గ్రామాల్లో అపారిశుద్ధ్యం గోచరిస్తోంది. పలు రహదారుల్లో రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగిపోయి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలని వారు కోరుతున్నారు.

పంచాయతీల్లో అపారిశుద్ధ్యం

జంగారెడ్డిగూడెం మండలంలో అనేక పంచాయతీల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం పనులు చేస్తున్నా, ఎక్కువ పంచాయతీల్లో పనులు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్యం క్షీణించడంతో డ్రెయిన్లలో మురుగు నీరు నిలిచి దోమలు పెరిగిపోతున్నాయి. ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మురుగు, చెత్తా చెదారాలను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

మెట్ట ప్రాంతంలో విష జ్వరాలు విజంభిస్తున్నాయి. గత 10 రోజులకుపైగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పిల్లలు, పెద్దలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. టైఫాయిడ్, మలేరియ, వైరల్ విషజ్వరాలతో ఆసుపత్రుల వద్ద బారులు తీరుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పట్టణాల్లో మురుగు డ్రెయిన్లను శుభ్రం చేయకపోవడం, మండలంలోని ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్యం నిర్వహణ అంతంత మాత్రంగానే ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధేదీ?



ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దష్టి పెట్టాలి. వర్షాలు ఎక్కువగా కురవడంతో గ్రామాల్లో దోమల పెరిగి అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రజలు అనారోగ్యాలకు గురికాకుండా చర్యలు చేపట్టాలి. దోమల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య శాఖ పని చేయాలి.

– ఎం గురుబ్రహ్మం, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు

23, 24వ తేదీల్లో వాలీబాల్ పోటీలు

జంగారెడ్డిగూడెం: గ్రామీణ యువతను ప్రోత్సహించి క్రీడా స్ఫూర్తిని పతాక స్థాయికి తీసుకెళ్లాలన్న మహోన్నత ఆశయంతో గత 16 సంవత్సరాలుగా ఇషా ఫౌండేషన్ ప్రతిష్టాత్మకంగా గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇషా ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జంగారెడ్డిగూడెంలో వారు మాట్లాడుతూ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించే వాలీబాల్ పోటీలకు 14 ఏళ్లు పైబడిన గ్రామీణ యువత అర్హులన్నారు. క్లస్టర్ స్థాయిలో విజేతలకు మొదటి నాలు గు బహుమతులుగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందజేయనున్నట్లు వివరించారు.

ప్రభుత్వం సాకులు చెప్పడం సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కుక్కునూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు వర్తింపజేయకపోవడంపై ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె కుక్కునూరులో విలేకరులతో మాట్లాడారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై షరతులు పెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా విలీన మండలాలపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం కుంటిసాకులు చెప్పడమేంటని ప్రశ్నించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అంతరాష్ట్ర బస్సు సర్వీసు పేరుతో నిలిపివేయకుండా ఉచిత బస్సు ప్రయాణాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చంద్రకళ, పద్మ, రమ్య, తిరుపతమ్మ, లక్ష్మి, భవాని, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు రూ.85,133 ఆదాయం



ప్రత్యేక అలంకరణలో శ్రీరాట్నాలమ్మ

పెదవేగి: రాట్నాలమ్మకు పలు ప్రాంతాల నుంచి చేరి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో మొక్కు బడులను తీర్చుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వేంచేసిన శ్రీరాట్నాలమ్మ దేవస్థానం రాట్నాలకుంటలో అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కుబడులను తీర్చుకునేందుకు బారులు తీరారు. ఆదాయ వివరాలు ఇలా.. పూజా రుసుముల ద్వారా రూ.49,930, విరాళాల ద్వారా రూ.5,083, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.24,600, పులిహోర అమ్మకం ద్వారా రూ.1,725, ఫొటోల అమ్మకం ద్వారా రూ.3,795, మొత్తం ఆదాయం రూ.85,133 ఆదాయం లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎన్.సతీష్ కుమార్ తెలిపారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి ఉపాలయమైన లక్ష్మీపురం ఆలయంలో సోమవారం నుంచి, దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురం ఆలయంలో మంగళవారం నుంచి దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో 18న అర్చకులు అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారన్నారు. 19న పవిత్రాధివాసం, 20న పవిత్రారోహణ, 21న పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. వీటితో నాలుగు రోజుల ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయి. ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో 19న అంకురార్పణ, 20న పవిత్రారోపణ, 21న పవిత్ర విసర్జన, మహా పూర్ణాహుతి వేడుకలు నిర్వహించనున్నారు. ఏడాదిలో ఆలయాల్లో తెలిసీ తెలియక జరిగే తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం ఉత్సవాలను నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ తెలిపారు.